సాక్షి అనకాపల్లి

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



అర్జీలను పరిష్కరించండి

పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. 8లో



డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆదివారం అర్ధరాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వసతులు, ప్రమాణాలను పరిశీలించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలను అందించారు.

న్యూస్‌రీల్

న్యాయమూర్తి చొరవతో నిర్వాసితులకు న్యాయం



నిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, రాచపల్లి సమీపంలో ఉన్న అన్‌రాక్ కంపెనీకి భూములు ఇచ్చిన 21 మంది నిర్వాసితులకు నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ చొరవతో న్యాయం జరిగింది. 2016 నుంచి నష్టపరిహారం కోసం నిర్వాసితులు పోరాడుతున్నారు. అయినా ఎటువంటి పరిహారం ఇవ్వకపోవడంతో బాధిత రైతులు న్యాయస్థానానికి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్‌కు ఈ ఏడాది జనవరిలో ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తి విచారణ జరపడంతో యాజమాన్యం నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. సోమవారం న్యాయమూర్తి సమక్షంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, ఏపీ ఐఐసీ విశాఖపట్నం, అన్‌రాక్ కంపెనీ యాజమాన్యం నిర్వాసితులకు పరిహారం సొమ్ము చెక్కులను అందజేశారు. నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తూ న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు.


పిల్లల దత్తతలో నిబంధనలు పాటించాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్


తుమ్మపాల: అనాథ పిల్లలను చట్టపరమైన నిబంధనల మేరకు దత్తత తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. 'మాతృత్వం ఒక వరం..దత్తత అందుకు మరో మార్గం 'పోస్టర్‌ను జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆమె సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 0 నుంచి 18 సంవత్సరాల పిల్లల దత్తతను వెబ్‌సైట్ http://WWW.CARA.NIC.IN ద్వారా చట్టపరంగా తీసుకోవాలన్నారు. ఏ విధమైన సందేహాలు ఉన్నా జిల్లా బాలల సంరక్షణ విభాగంలో సంప్రదించాలన్నారు. పిల్లల దత్తతకు సంబంధించిన మరింత సమాచారం కోసం జిల్లా బాలల సంరక్షణ రక్షణ అధికారి ఫోన్ నంబర్ 89789 17154, పరిరక్షణ అధికారి ఫోన్ నంబర్ 85008 96656లో సంప్రదించాలన్నారు.

10న తాండవ నీటి విడుదల



నాతవరం: ఖరీఫ్ సాగు కోసం తాండవ రిజర్వాయరు నీటిని ఈ నెల 10న విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాండవ రైతులు, ప్రజాప్రతినిధుల ప్రాజెక్టు కమిటీ చైర్మన్, సభ్యుల అభీష్టం మేరకు నీటిని విడుదల చేసే తేదీ ఖరారు చేశామన్నారు. స్పీకరు అయ్యన్నపాత్రుడు తాండవ రిజర్వాయరు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారన్నారు. ప్రాజెక్టులో సోమవారం సాయంత్రానికి 371.1 అడుగులు ఉందన్నారు. తాండవ ప్రమాద స్థాయి నీటి మట్టం 380.0 అడుగులు కాగా.. డేడ్ స్టోరేజీ నీటి మట్టం 345 అడుగులుగా పరిగణిస్తామన్నారు. తాండవ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని రెండు కాలువలు ద్వారా రోజు ఒక్కంటికి 500 క్యూసెక్కులు చొప్పున 70 రోజులు ఆయకట్టుకు ప్రవహిస్తుందన్నారు. ఈలోపు వర్షాలు కురిసి నీటి మట్టం పెరిగితే ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఢోకా ఉండదన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్ విజేతకు అభినందన



బాల సరస్వతిని అభినందిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష పీవో డాక్టర్ జయప్రకాష్

అనకాపల్లి టౌన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ బోసి బాల్ గేమ్ క్రీడా పోటీలలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థిని బాల సరస్వతిని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జయప్రకాష్ అభినందించారు. స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో ఆమెను సత్కరించారు. రావికమతం మండలం చినగుమ్ములూరు కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాల సరస్వతి బాల్‌గేమ్ పోటీలలో నాలుగో స్థానం సాధించడం పట్ల జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.ఆర్.వి.రామకృష్ణనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని శకుంతల తదితరులు అభినందించారు.

రక్షకులు కాదు.. గో భక్షకులు

గో సంరక్షకులుగా బిల్డప్ ఇస్తారు.. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుంటారు. పోలీసులకు అప్పగించి ఆ ఆవులను అధికారికంగానే చారిటబుల్ ట్రస్ట్ గోశాలకు తరలిస్తారు. ట్రస్ట్ ముసుగులో పశువులను ఇక్కడ నుంచి వ్యాన్లలో హైదరాబాద్‌కు తరలించి పశువధ చేసే వ్యాపారులకు విక్రయిస్తారు. టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు ట్రస్టుగా ఏర్పడి చేస్తున్న దారుణమిది. దీనిపై ఎస్.రాయవరానికి చెందిన సోమిరెడ్డి వెంకట అప్పల సత్యసన్యాసి నూకరాజు లోకాయుక్తకు, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలకు ఫిర్యాదు చేశారు.



వ్యాన్‌లో గోవులను తరలిస్తున్న దృశ్యం





రక్షణ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ దేముళ్లు విజిటింగ్ కార్డ్



పెనుగొల్లులో ఏర్పాటు చేసిన రక్షణ చారిటబుల్ ట్రస్ట్ గోశాల

- రక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరిట పశువుల అక్రమ రవాణా
- ఇక్కడ నుంచి వ్యాన్లలో హైదరాబాద్ 'కొట్టాయి'కి తరలింపు
- విజయవాడలో ఉన్న యానిమల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా గుర్తింపు పత్రం
- ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామంలో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు
- వారాంతపు సంతలను ఆదాయ వనరులుగా మార్చుకుంటున్న అక్రమార్కులు
- ఈ ఏడాది పది వాహనాల్లో తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వైనం

సాక్షి, అనకాపల్లి:

దొంగలకు దొంగ.. ఘరానా దొంగ.. ఇలా ఎన్ని పేర్లతోనైనా వీరిని పిలుచుకోవచ్చు. రక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు అధికారుల కళ్లుగప్పి అక్రమార్జనకు తెరలేపారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామంలో వీరు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఏపీ యానిమల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అక్రమ మార్గంలో రికగ్నిషన్ సర్టిఫికెట్ పొంది గోశాలను నడుపుతున్నారు. జాతీయ రహదారిలో గోవులను అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని వాటిని పోలీసులు అప్పగించి ఆ ఆవులను చారిటబుల్ ట్రస్ట్‌కు తరలించుకుంటారు. అంతేకాకుండా ఏజెన్సీలోని పాడేరు, అరకు ప్రాంతాల్లో తక్కువ ధరకే గోవులను కొనుగోలు చేసుకుని ఇక్కడకు తీసుకొస్తారు. రక్షణ చారిటబుల్ ట్రస్ట్ ముసుగులో హైదరాబాద్‌లో పశువధ చేసే వ్యాపారుల 'కొట్టాయి'కి వ్యాన్లలో ఆవులను తరలిస్తున్నారు. ఎస్.రాయవరం మండలంలో పెనుగొల్లు, సోముదేవుపల్లి, గోకులపాడు, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి టీడీపీ నాయకుల అండదండలతో పెనుగొల్లు గ్రామంలో డోర్ నెం.2–8/2 అడ్రస్‌తో 'రక్షణ చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటు చేశారు.

పశు రవాణా నిబంధనలేమిటంటే..

పాడి పశువులు, ఆవులు, దూడలు, ఎద్దులను వధించడంపై మన దేశంలో నిషేధం విధించినప్పటికీ యథేచ్ఛగా వధశాలలకు పశువులను తరలించడం నిత్యకృత్యంగా మారింది. వీటి తరలింపునకు ప్రత్యేక నిబంధనలున్నాయి. మూగజీవాలను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ పత్రాలతోపాటు జీవాలను తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు కలిగి ఉండాలి. పశువుల రవాణా సమయంలో మూగజీవాలకు సరిపడా గాలి, మేత, నీరు అందుబాటులో ఉండేటట్టు ఏర్పాట్లు చేయాలి. పెద్ద వాహనాల్లో పశువులను తరలించేటప్పుడు ఒక పశువు కోసం రెండు స్క్వేర్ మీటర్ల వంతున విడివిడిగా అరలను తయారుచేసి అందులో పశువులను తరలించవలసి ఉంటుంది. గూడ్స్ వాహనాల్లో పశువులను తరలించినా, పరిమితికి మించి మూగజీవాలను తరలించినా భారీ జరిమానాతో పాటు తరలించే వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉంది.



హోంమంత్రి అనితతో రక్షణ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ దేముళ్లు (ఫైల్)

హైవేపై రవాణా చేసేవారే టార్గెట్..

అనకాపల్లి జిల్లాలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి సమయంలో వాహనాల్లో పశువుల రవాణా నిర్భయంగా సాగుతోంది. ఈ రవాణాదారులనే లక్ష్యంగా చేసుకొని ట్రస్టు ముసుగులో పశువులను రక్షిస్తామని స్వాధీనం చేసుకుంటున్నారు. అదే తప్పు దర్జాగా వీరు కూడా చేస్తున్నారు. ఒక్కో వాహనంలో 20 నుంచి 40 వరకు పశువులను తాళ్లతో బంధించి అతి క్రూరంగా వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేల పెద్ద ఎత్తున అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

పవిత్రంగా భావించే గోవులను అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థ ముసుగులో వివిధ స్టేషన్లలో పోలీసులు పట్టుకున్న ఆవులు, ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చిన ఆవులు, పశువులు, తమ సంస్థ షెడ్‌కు పెద్ద సైజు వ్యానుల్లో తరలిస్తుంటారు. అక్కడ నుండి చిన్న సైజు వాహనాల్లో అనకాపల్లి బోర్డర్ తుని వరకు ట్రస్టు పేరుతో పంపిస్తారు. అక్కడ నుంచి వేరే వ్యక్తులు హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. కొన్ని ఆవులు తిండి లేక, అనారోగ్యంతో, తరలింపు సమయంలో గాయాలపాలై మృతి చెందుతున్నాయి. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటీవలే పోలీసులు 10 మందికి పైగా పశువుల అక్రమ రవాణా చేసే వారిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఆ ఆవులను ఈ సంస్థకే తరలించారు.

– సోమిరెడ్డి వెంకట అప్పలసత్యసన్యాసి నూకరాజు, ఎస్.రాయవరం

ప్రజల్లోకి బాబు మోసాలు



బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, ఇతర నాయకులు

- నిలదీసేలా చైతన్యం తీసుకురావాలి
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నిలదీసేలా చైతన్యం తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కంబాల జోగులు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని బాండ్లపై సంతకాలు చేసి మరీ కూటమి నేతలు హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నమాట నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. కూటమి పార్టీలు ఇచ్చిన బాండ్లు, మేనిఫెస్టోలను ఆన్‌లైన్‌లో ఉంచి 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పేరుతో ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. తల్లికి వందనం పథకం రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మందికి అందలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కూడా అర్హులందరికీ రాలేదన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి భ్రమగానే మిగిలాయన్నారు. ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలన్నారు. రెండు వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి కేవలం అతితక్కువ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు.

దేవవరం నుంచి శ్రీకారం

వీసం రామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15 దాటిన తర్వాత దేవవరం నుంచి మొదలు పెడతామన్నారు. పరిశ్రమలకు భూములిచ్చిన నిర్వాసిత రైతులకు పరిహారం, ప్యాకేజీ విషయంలో పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావు, మహిళా విభాగం కార్యదర్శి తుమ్మా కల్పన, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ బాబా, సర్పంచ్‌లు గొర్ల నర్సింహమూర్తి, రోహిణి, అల్లు రమణ, వియ్యపు శ్రీను, పి.వెంకటేష్, వెదుళ్ల రమణ, ఎంపీటీసీ సభ్యులు లొడగల చంద్రరావు, గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు, నిట్ల గోవిందు, బచ్చలరాజు, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పాలిట కాలకూటమి



కలెక్టర్‌కు వినతి పత్రం అందించేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు



కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, నియోజకవర్గాల సమన్వయకర్తలు కంబాల జోగులు, మలసాల భరత్‌కుమార్, అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్

- మొద్దునిద్రలో కూటమి ప్రభుత్వం ..అప్పుల ఊబిలో అన్నదాతలు
- గతేడాది అన్నదాత సుఖీభవ లేదు..ఈ ఏడాది 24 వేల మంది లబ్ధిదారుల కోత
- ఇచ్చింది రూ.5వేలే..మిగిలిన రూ.15 వేలు ఎప్పుడిస్తారో..?
- మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు
- ఎరువుల కొరతపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు
- హాజరైన మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు, సమన్వయకర్తలు


అనకాపల్లి : దేశానికి అన్నం పెట్టే రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచిందని.. ఏడాది కాలంలో రైతులు అప్పులు చేసుకుని వ్యవసాయం చేసే పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, ఏడాదిగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయలేదు..ఈ ఏడాది కూడా కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చి సరిపెట్టారు. మిగిలిన రూ.15 వేలు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా జిల్లాలో సుమారు 24 వేల మంది లబ్దిదారుల్లో కోత విధించారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత నివారించాలంటూ సోమవారం వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఖరీఫ్ సీజన్‌కు సచివాలయంలో అగ్రికల్చర్ కార్యదర్శితో గ్రామంలో రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలతో పాటు రైతు భరోసా సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు గతంలో రాష్ట్రంలో వ్యవసాయం అంటేనే దండగ అని రైతులను కించపరిచారని అన్నారు. రాష్ట్రంలో జీఎస్‌డీపీ 40 నుంచి 42 శాతం ఉండేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నేటి వరకూ కావలసిన ఎరువులు, యూరియా, భూసార పరీక్షలు చేయలేదన్నారు. భూసారాన్ని బట్టి వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయం అగ్రికల్చర్ కార్యదర్శి ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు బాగుంటేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, వరినాట్లు వేసే సమయంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఖరీఫ్ సీజన్ పంటలపై దృష్టి సాధించాలని హితవు పలికారు. రైతులకు గిట్టుబాటు ధర వైఎస్సార్‌సీపీ పాలనలో కల్పించడం జరిగిందని, కూటమి పాలనలో రైతుల సమస్యలు పట్టించుకోనే నాయకుడు కనిపించడం లేదన్నారు. మొద్దు నిద్రలో కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు.

కార్యక్రమంలో వివిధ నియోజకవర్గ సమన్వయకర్తలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్, జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదల భూములపై సర్కారు కన్ను



భూములమ్మి..నిధుల సేకరణ

- ప్రభుత్వ ఆదేశాలతో భారీగా ల్యాండ్ పూలింగ్‌కు సిద్ధమైన అధికార్లు
- అసైన్డ్ భూములు, ఆక్రమణల్లో ఉన్న భూముల సేకరణకు కసరత్తు
- విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 1,941 ఎకరాల సేకరణే లక్ష్యం
- నోటిఫికేషన్ జారీ చేసిన జాయింట్ కలెక్టర్
- ఈ భూములను వీఎంఆర్‌డీఏకు అప్పగించేందుకు చర్యలు
- భూములను విక్రయించి నిధులు సమకూర్చుకోవాలని ప్రభుత్వ ఆలోచన

మహారాణిపేట (విశాఖ):

పేదల భూములపై కూటమి సర్కార్ కన్నుపడింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా పేదల భూములను సేకరించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను సేకరించనున్నారు. ఈ మూడు జిల్లాల్లో మొత్తం 1941 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సేకరించిన ఈ భూములను వీఎంఆర్‌డీఏకు అప్పగించి, వాటిని విక్రయించడం ద్వారా నిధులు సమీకరించాలని యోచిస్తోంది. ఇలా వచ్చిన నిధులను ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. ఈ నిధులతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవడంపై దృష్టి సారించింది. అసైన్డ్ పట్టా ఉంటే ఎకరానికి 900 గజాలు, ఆక్రమణదారుడైతే ఎకరానికి 450 గజాల స్థలం డెవలప్‌మెంటు చేసి ఇవ్వాలని నిర్ణయించారు. ల్యాండ్ పూలింగ్ కోసం 2016లో చేసిన చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పర్యవేక్షణలో ఆర్డీవోలు భూసమీకరణ చేయాలని ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది. ఈ భూముల సేకరణ కోసం సోమవారం నోటిఫికేషన్ ఇచ్చామని, ఈ భూసేకరణ అంతా పారదర్శకంగా చేస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం మీడియాతో జేసీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అంతా భూ సేకరణ జరుగుందన్నారు. రికార్డ్స్ ట్యాంపరింగ్ జరగకుండా చూస్తామని, రికార్డులను బట్టి ఆక్రమణదారులను గుర్తిస్తామన్నారు.

సేకరించే భూముల వివరాలు

విజయనగరం జిల్లా డెంకాడలో సర్వే నంబర్లు 241, 242, 243ల్లో 20.41 ఎకరాలు

భోగాపురం మండలంలో రావాడ సర్వే నంబర్ 64/1లో 5 ఎకరాలు

అనకాపల్లి జిల్లాలో ..

ప్రాంతం	విస్తీర్ణం
సబ్బవరం మండలం అంతకాపల్లిలో	175.42 ఎకరాలు
బాటజంగాలపాలెంలో	141.01 ఎకరాలు
ఎ.సిరసపల్లిలో	371.75 ఎకరాలు
నాల్ల రేగుడిపాలెంలో	27.37 ఎకరాలు
పైడివాడ అగ్రహారంలో	28.14 ఎకరాలు
అనకాపల్లి మండలంలో తగరంపూడిలో	40 ఎకరాలు

విశాఖ జిల్లాలో..

ప్రాంతం	విస్తీర్ణం
ఆనందపురంలో గిడిజాలలో258 సర్వే నంబర్‌లో	309.18 ఎకరాలు
ఆనందపురంలో గోరింట్ల సర్వే నంబర్ 108లో	198.31 ఎకరాలు
ఆనందపురంలో శొంఠ్యాంలో 347/పీ సర్వే నంబర్‌లో	251.55 ఎకరాలు
ఆనందపురంలో బి.డి.పాలెంలో సర్వే నంబర్ 1లో	122.53 ఎకరాలు
పద్మనాభంలో కొవ్వాడ 237 సర్వే నంబర్‌లో	250.52 ఎకరాలు

మొత్తం 1941 ఎకరాల 19 సెంట్లు భూమి సేకరిస్తున్నారు

క్లుప్తంగా

ప్రత్యేక ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



మహాలక్ష్మినాయుడును సన్మానిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జయప్రకాష్

రావికమతం : జాతీయ స్థాయి దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్ భారత్ బోసిబాల్ క్రీడా పోటీల్లో రాష్ట్ర విద్యార్థులు ఆరు పతకాలు సాధించేందుకు కృషి చేసిన కోచ్ మేడివాడ హైస్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడును పలువురు అభినందించారు. ఆయనను అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జయప్రకాష్, జిల్లా సహిత విద్య సమన్వయకర్త వి.ఆర్ కృష్ణం నాయుడు, చిన గుమ్ములూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శకుంతల శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రశంసా పత్రం అందజేశారు. గత నెల 24 నుంచి 28 వరకూ చత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పాయి యూనివర్శిటీ స్టేడియంలో జరిగిన బోసి బాల్ గేమ్‌లో రాష్ట్రం నుంచి ఆరుగురు పాల్గొనగా, ఒకరికి బంగారు పతకం, ఇద్దరికి రజత, ముగ్గురికి కాంస్య పతకాలు రావడంలో ప్రత్యేక ఉపాధ్యాయుడి కృషి అభినందనీయమని అన్నారు.

మూడు దశల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు

మహారాణిపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడు దశల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని, దేశభక్తి భావజాలాన్ని ప్రజల్లో నింపే విధంగా విస్తృత ప్రచార క్యాంపెయిన్లు నిర్వహించాలని సూచించారు. పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయుట, ర్యాలీలు చేపట్టడం, ఇతర కార్యక్రమాల నిర్వహణలో ప్రోత్సాహం అందించాలని చెప్పారు. మొదటి దశ ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు, రెండోది 9 నుంచి 12వ తేదీ వరకు, 13 నుంచి 15వ తేదీ వరకు మూడో దశల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

తిరంగతో సెల్ఫీ, ప్రభాత్–ఫెరిస్, తిరంగ ర్యాలీలు, తిరంగ ప్రదర్శనలు, ఇతర అట్టడుగు స్థాయి జనభాగీదారీ కార్యక్రమాలు ఉంటాయని స్పష్టం చేశారు. సెల్ఫీలను www.harghartiranga.com వెబ్ సైట్ ద్వారా అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. అధికారులు, ప్రజలు హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించండి

- కలెక్టర్ విజయ కృష్ణన్
- పీజీఆర్‌ఎస్‌కు 284 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆమెతోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను దరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. పరిష్కారం కాని వాటి గురించి అందుకు గల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చన్నారు. పీజీఆర్‌ఎస్ అర్జీలు జిల్లా, మండల అధికారుల లాగిన్‌లో ఉంటే సంబంధిత అధికారులు నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి, ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని రోజూ పర్యవేక్షణ చేసి నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ వారం మొత్తం 284 అర్జీలు స్వీకరించామని, అధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు నమోదయ్యాయన్నారు. కార్యక్రమంలో కె.ఆర్.ఆర్.సి, పి.జి.ఆర్.ఎస్ ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్.సుబ్బలక్ష్మి, రమామణి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ శచీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణ మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. హైమావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

ఈ నెల 6న నిర్వహించనున్న ఏపీ బల్క్ డ్రగ్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రద్దు చేయడంతోపాటు నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శంకరరావు కలెక్టర్‌ను కోరారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో 1270.80 ఎకరాల భూసేకరణపై ఈఐఏ నివేదిక తప్పుల తడకగా ఉందన్నారు. ప్రజా ప్రయోజనాల పేరుతో ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూరేలా బలవంతపు భూసేకరణపై తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నామన్నారు. బల్క్ డ్రగ్ పార్కులో నిర్మించే ఫార్మా పరిశ్రమల్లో రసాయన ప్రక్రియపై వాస్తవాలను దాచి తప్పుడు సమాచారం ప్రజలకందిస్తున్నారన్నారు. ఈఐఏ నివేదిక ఆధారంగా జరిగే ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేసి సరైన వాస్తవ నివేదికతో కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులు అభ్యంతరాలు చెబితే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామంటూ స్థానిక సీఐ, పోలీసులు గ్రామాల్లో ప్రజలను భయపెడుతున్నారన్నారు. సీఐ చర్యలపై విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలన్నారు.

వితంతు పింఛన్ మంజూరు చేయండి..



నా భర్త మరణించి మూడేళ్లకుపైగా అవుతోంది. వితంతు పింఛన్ మంజూరు చేయకుండా సచివాలయ సిబ్బంది కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారు. ఈ నెలలో కొత్తగా మంజూరు చేసిన పింఛన్లలో నా పేరు లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాను. మా అత్తకు నాకు వేర్వేరు రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం కలిసి ఉండటం లేదు. అయినప్పటికీ మా అత్తకు పింఛన్ వస్తుందని, సచివాలయ మ్యాపింగ్‌లో ఒకే కుటుంబంగా చూపిస్తుందని సిబ్బంది చెబుతున్నారు. నిరుపేదగా ఉన్న నాకు పింఛన్ మంజూరు చేసి న్యాయం చేయాలని కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామానికి చెందిన వితంతురాలు అప్పికొండ రాజేశ్వరి కలెక్టర్‌కు మొరపెట్టుకుంది.

ఎస్పీ కార్యాలయానికి 31 అర్జీలు



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి సోమవారం 31 అర్జీలు వచ్చాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుహిన్‌సిన్హా మాట్లాడుతూ భూ తగాదాలు–16, కుటుంబ కలహాలు–6, ఇతర విభాగాలకు చెందినవి–9 అర్జీలు వచ్చాయని చెప్పారు. చట్టపరిధిలో సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు దిగువ స్థాయి పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానం శానిటేషన్ ఇన్‌చార్జి సస్పెన్షన్

సింహాచలం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శానిటేషన్ విభాగం ఇన్‌చార్జి జి.కొండలరావును(జూనియర్ అసిస్టెంట్ క్యాడర్) దేవస్థానం ఈవో వి.త్రినాథరావు సోమవారం సస్పెండ్ చేశారు. సింహగిరిపై శానిటేషన్ పనులు పరిశీలించాల్సిన బాధ్యతను కొండలరావు విస్మరించడంతో ఈవో వి.త్రినాథరావు గతంలోనే హెచ్చరించారు. ఇటీవల శానిటేషన్ అధ్వానంగా తయారవడంపై భక్తులు దేవస్థానం ఈవోకే ఫిర్యాదు చేశారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం వివాహితుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వివాహితులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్, మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ల ఏర్పాటు కోసం నివాస ప్రాంతాలను ఇచ్చిన కుటుంబాల్లో పెళ్లయిన ఆడవాళ్లకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింజేయాలంటూ పలువురు వివాహితులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. మండలంలోని చందనాడ, తమ్మయ్యపేట, మూలపర, పాటిమీద, తుమ్మలపేట, తదితర గ్రామాలకు చెందిన పలువురు వివాహితులు ఇక్కడకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2014లో భూసేకరణ సమయంలో ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేస్తామని నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఆ సమయంలో నిర్వాసిత కుటుంబాల్లో వివాహం కాని ఆడవారికి మేజర్లయిన ఆడ, మగవారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తామంతా జిరాయితీ భూముల్లో ఇళ్లను కంపెనీల కోసం ఇవ్వడానికి ఒప్పుకున్నామన్నారు. తీరా ఇప్పుడు పెళ్లయిన ఆడపిల్లలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదన్నారు. ప్యాకేజీ కింద ఐదు సెంట్ల ఇల్ల స్థలం, రూ.8.98 లక్షలు చొప్పున వివాహం కాని ఆడవారికి కుటుంబ యజమానికి మేజర్లయిన మగ పిల్లలకు మాత్రమే ఇస్తున్నారన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసి పదేళ్లు గడిచిందన్నారు. పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలను ఎన్నాళ్లు ఇళ్లలో ఉంచుకుంటారని, అప్పులు చేసి వివాహాలు చేస్తే, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ నినాదాలు చేశారు. వివాహమైన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు అప్పలరాజు, మనబాల రాజేష్, చంటమ్మ, తుమ్మల భవానీ, శిరీషా, ఉప్పలూరి మానస, అశ్విని దుర్గ, నాగదుర్గ, రావి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏపీ ఆదివాసీ సంఘ నాయకులు

నర్సీపట్నం: ఏటా ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆదివాసీ సంఘం నాయకులు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆదివాసీ సంఘం నాయకులు కె.జనార్దన్, మోసూరి రాజు మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలని 1977లోనే ఏపీ మంత్రివర్గం తీర్మానం చేసినా, నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. ఆదివాసీల స్వాధీన అనుభవంలో ఉన్న భూములను గుంజుకోవడానికి భూ మాఫియా దాడులు చేస్తుందన్నారు. ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న అటవీ, ప్రభుత్వ బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

పరిహారం ఇవ్వలేదని రైతు మనస్తాపం

- బలవంతంగా పాకల తొలగింపుతో గుండెపోటు మృతి
- కృష్ణపాలెంలో విషాదఛాయలు

రాంబిల్లి(అచ్యుతాపురం): పరిశ్రమల ఏర్పాటు కోసం రైతులు సాగు చేసే భూముల సేకరణ, జీవన భృతినిచ్చే పశువుల పాకలను బలవంతంగా తొలగించారనే వేదనతో ఓ రైతు మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందిన ఘటన రాంబిల్లి మండలంలో చోటు చేసుకుంది. కృష్ణంపాలెం గ్రామస్తులు, మృతుని భార్య వరహాలమ్మ అందించిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం కృష్ణంపాలెం శివారు గ్రామాల్లో ఉన్న భూముల్ని ఏపీఐఐసీ సేకరించింది. ఇటీవల అదనపు కర్మాగారాల స్థాపన కోసం గతంలో సేకరించిన భూముల్లో పశువులు పాకల్ని తొలగించే ప్రక్రియ చేపట్టారు. అయితే సర్వే బృందం ఇచ్చిన నివేదిక మేరకు అర్హులను గుర్తించడంలో పక్షపాతం చూపించారని ఇప్పటికే ఆ గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



పెడియ్య(ఫైల్)

కళ్ల ముందు పాకల్ని తొలగించడం చూసి..

కృష్ణంపాలెంకు చెందిన రైతు కుప్ప పైడియ్య(63) పశువుల పాకల్ని, ఇతరత్రా జీవన భృతికి దోహదపడే చెట్లను ఎటువంటి పరిహారం ఇవ్వకుండా తొలగించారు. తమకు న్యాయం జరగలేదని, కుటుంబానికి ఆధారం లేకుండా చేశారని మదనపడిన పైడియ్య సోమవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో గుండెపోటుకు గురై మృతి చెందారు. తమకు న్యాయం చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కంపెనీ సిబ్బంది దురుసు ప్రవర్తన కారణంగా తన భర్త మృతి చెందారని వరహాలమ్మ, కుమారుడు గణేశ్ కన్నీరుమున్నీరుగా విలపించారు. అభివృద్ధి పేరిట ప్రజల జీవన భృతిని దూరం చేసి ఆదుకోకపోవడం అన్యాయమని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అదనపు భారం మోపొద్దని నిరసన



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

- అధికారులకు సెల్‌ఫోన్లు సరెండర్ చేసిన అంగన్‌వాడీలు

నక్కపల్లి : ప్రధానమంత్రి మాతృ వందన యోజన వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు బాధ్యత అప్పజెప్పడంపై అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్‌లను సోమవారం నక్కపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో సరెండర్ చేశారు. వాటితోపాటు సిమ్ కార్డులను వెనక్కి తిరిగి ఇచ్చేసారు. అంగన్‌వాడీ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి మాట్లాడుతూ 2జి రామ్‌తో 4జి నెట్‌వర్క్‌తో ఉన్న ఈ ఫోన్లను ఐదేళ్ల క్రితం అందజేశారన్నారు. ప్రస్తుతం 5జీ ఫోన్లలో మాత్రమే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యాప్‌లు ఇన్‌స్టాల్ అవుతున్నాయన్నారు. తక్కువ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ ఫోన్‌ల ద్వారా లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేయడం సాధ్యం కావడం లేదన్నారు. 5జీ టెక్నాలజీ కలిగిన ఫోన్‌లు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి ట్యాబులు సరఫరా చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఏడాది పూర్తయినా హామీ నెరవేర్చలేదన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు జీవో విడదల చేయలేదన్నారు. ఐసీడీఎస్ పరిధిలో 309 మొబైల్ ఫోన్‌లను ఐసీడీఎస్ కార్యాలయంలో సరెండర్ చేశామన్నారు.

డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు

- కలెక్టర్ విజయ కృష్ణన్



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వెయ్యాలని, కాలానుగుణ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న అనేక సేవలపై అధికారులతో సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీ, షెడ్లు, గ్రామీణ నీటి సరఫరా, జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వే, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, డ్వామా శాఖలపై, సూర్య ఘర్, ఉపాధి హామీ అంశాలపై సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గిరి శిఖర గ్రామాల్లో మంచినీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చెయ్యాలన్నారు. రెండు ఆవులను స్వయం సహాయక బృందాల ద్వారా లోన్ ఇప్పించుటకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేసి చెత్త సంపద సృష్టి కేంద్రానికి పంపించే ఏర్పాటు చెయ్యాలన్నారు. ప్రతి గ్రామంలో సూర్య ఘర్ యోజన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జిల్లాలో 5 సోలార్ గ్రామాలతో పాటు మిగిలిన అన్ని గ్రామాల్లో సోలార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నారాయణ మూర్తి, డ్వామా పీడీ పి.పూర్ణిమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏఎస్‌ఏ రామస్వామి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి, ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, డీపీఆర్సీ జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, జిల్లా గ్రామ వార్డు సచివాలయల అధికారి మంజులవాణి, పంచాయతీరాజ్ డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

పరారైన ముగ్గురు నిందితుల అరెస్టు



నిందితులతో పోలీసులు

గొలుగొండ: గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో గంజాయి కేసులో విజయవాడకు చెందిన ప్రధాన సూత్రధారులు చిన్ను(27), గుమ్మిడి సందీప్, తెలంగాణకు చెందిన చందు విక్రమ్ తప్పించుకుని తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వీరిని పట్టుకుని కోర్టుకు హాజరుపరచగా, విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–5లోని ఓ స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వ్యభిచార ముఠాను పట్టుకున్నారు. ఎంవీపీ కాలనీ పోలీసులతో కలిసి నిర్వహించిన ఈ దాడుల్లో స్పా సెంటర్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వేర్వేరు ప్రాంతాల యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారని, ఈ ముఠా లక్షలు సంపాదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు ఇద్దరు నిర్వాహకులతో పాటు, ఆరుగురు విటులను, ఇద్దరు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు.

అంగన్‌వాడీ పోస్టు తారుమారుపై కౌన్సిల్‌లో చర్చకు కృషి

- దళిత మహిళ సునీతకు ధర్మశ్రీ హామీ
- తిమ్మరాజుపేటలో దీక్ష శిబిరం సందర్శన



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీకి వినతిపత్రం అందిస్తున్న దళిత మహిళ సునీత

అచ్యుతాపురం రూరల్ : తిమ్మరాజుపేటలో గత 20 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న దళిత మహిళ మంత్రి సునీతను సోమవారం వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పరామర్శించారు. తనకు రావల్సిన అంగన్‌వాడీ పోస్టును తారుమారు చేశారని ఆరోపిస్తూ ఆమె చేపట్టిన దీక్ష శిబిరాన్ని ధర్మశ్రీ సందర్శించి సంఘీభావం తెలిపారు. తనకు జరిగిన అన్యాయాన్ని, ఇప్పటి వరకూ వస్తున్న బెదిరింపుల విషయంపై ఆయనకు సునీత వివరించారు. తనకు న్యాయం చేయాలంటూ ధర్మశ్రీకి ఆమె వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, తదితర పార్టీ పెద్దలతో మాట్లాడి వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చించి, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యం దృష్ట్యా దీక్ష విరమించాలని ఆమెకు ధర్మశ్రీ సూచించారు.

ఆ జీవో విద్యార్థుల గొంతు నొక్కేందుకే..!

- విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కితీసుకోవాలి
- ఉత్తర్వుల కాపీని దహనం చేసిన ఎస్‌ఎఫ్‌ఐ



విద్యాశాఖ ఉత్తర్వుల కాపీని దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

బీచ్‌రోడ్డు: పాఠశాలల్లో విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్న విద్యాశాఖ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉత్తర్వుల ప్రతులను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేసింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె. నాయుడు మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు విద్యార్థులు తమ సమస్యలను బయటకు తెలియజేసే అవకాశాన్ని లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధమని, విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నమేనన్నారు. ఈ ఉత్తర్వుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లే విద్యార్థి సంఘాలకు అనుమతి లభించదని, దీనివల్ల విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా పోతాయన్నారు. ప్రైవేటు పాఠశాలల దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాసరావు

మునగపాక: క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీల ట్రోఫీని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఎమ్మెల్యే విజయకుమార్ జన్మదిన సందర్భంగా నాగులాపల్లిలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పెద్దలు టెక్కలి పరశురామ్, శరగడం యోగి నాగేశ్వరరావు, పాలమరశెట్టి మురళి, ఆడారి గణేష్, ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు, ఆడారి జగన్నాథరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా టెక్నికల్ కోచ్‌లు గణపతి, శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉప్పుటేరు భూములు ఏపీఐఐసీకి ఇవ్వొద్దు

అనకాపల్లి టౌన్: అచ్యుతాపురం మండలం పూడిమడక ఉప్పుటేరులో 166.15 ఎకరాల భూములను సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా ఏపీఐఐసీకి బదలాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 113లో 45.48, 139లో 120.67 ఎకరాలు మొత్తం 166.15 ఎకరాల భూమి కేటాయింపులను విరమించుకోవాలన్నారు. ఏ అవసరాలకు ఆ భూములను వినియోగిస్తారు, పర్యావరణపై ఎటువంటి ప్రభావం పడుతుందనేది ఈఐఏ నివేదిక తయారు చేయాల్సి ఉందన్నారు. ఈ నివేదికలు ఏవీ విడుదల చేయకుండా ఏకపక్షంగా ఉప్పుటేరు భూములను పారిశ్రామికాభివృద్ధి పేరుతో ఏపీఐఐసీకి బదలాయించి వ్యాపారం చేసి సొమ్ము చేసుకోవాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. తక్షణమే ఈ భూములన్నీ మత్స్యకారులకు కేటాయించాలన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. మధ్యాహ్నం పేదలకు దాతల సహకారంతో అన్న సమారాధన జరిగింది. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

లేఅవుట్ల లబ్ధిదారులకు సభలు నేడు

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ లేఅవుట్లలో సెంటు ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులకు జోనల్ కార్యాలయం పరిధి అన్ని వార్డు సచివాలయాల్లో మంగళవారం సభలు నిర్వహిస్తున్నామని జీవీఎంసీ హౌసింగ్ ఏఈ పింకి తెలిపారు. ఈ లేఅవుట్లలో జియో ట్యాగింగ్, ముఖహాజరు కాని లబ్ధిదారులు, బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయని వారు వివరాలను వెల్లడిస్తామన్నారు. మండలంలోని గొలగాం 1, 2, 3, కోడూరు 1, 4, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, సత్యనారాయణపురం గ్రామాల్లో వేసిన లేఅవుట్ల లబ్ధిదారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

అనకాపల్లి ఎంఈవో-1గా శ్రీదేవి



ఎంఈవో-1 శ్రీదేవిని శాలువాతో సత్కరించిన సీఆర్పీలు

అనకాపల్లి: మండల విద్యా శాఖ-1 అధికారి ఎస్.కె.శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంఈవో చిట్టిబాబు పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో పరవాడ ఎంఈవో దివాకర్‌కు అనకాపల్లి ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా పరవాడ మండలం తానాం హైస్కూల్లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎస్.కె.శ్రీదేవి పదోన్నతిపై అనకాపల్లి ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం సీఆర్పీ యూనియన్ నాయకులు ఎంఈవోలు-1, 2 శ్రీదేవి, కోటేశ్వరరావులను శాలువాలతో సత్కరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 133 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,000	4,400
రెండో రకం	4,200	4,200
మూడోరకం	3,000	3,420

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: జూనియర్
పర్తిసాయి	: మహావతార్ నరసింహ
వెంకటేశ్వర	: లోపలకి రా చెప్తా..
శ్రీ సత్య	: తమ్ముడు
రామచంద్ర	: హరిహర వీరమల్లు

రక్త నిల్వలు


అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7, బీ పాజిటివ్-23, ఓ పాజిటివ్-34, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 356 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కొండెక్కిన కాయగూరల ధరలు

- ఘాటెక్కిన మిర్చి
- ఆకుకూరలదీ అదేబాట
- మార్కెట్లో కొనుగోలుదారులకు చుక్కలు





కొనుగోలుదారులు లేక బోసిపోతున్న కాయగూరల మార్కెట్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని కాయగూరల మార్కెట్‌లో ధరలు చుక్కలను చూపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలలో వర్షాలు ఎక్కువగా పడడంతో కాయగూరల పంటలకు నష్టం జరుగుతుంటే అనకాపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనికితోడు శ్రావణమాసం కావడంతో నీచు, మాంసాలవైపు ఎక్కువగా మక్కువ చూపరు. ప్రతి ఒక్కరూ కాయగూరలే వండుతుంటారు. వారం పది రోజుల క్రితం వరకు అందుబాటులో ఉండే కాయగూరల ధరలన్నీ ఒక్కసారిగా రెట్టింపు అవడంతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.

పావు కేజీతో సరి..

పచ్చిమిర్చి కేజీ రూ.100 అవడంతో వాటిని ముట్టుకోవడానికి సాహసించడంలేదు. బీన్స్ కేజీ రూ.100, ఆగాకరకాయలు రూ.100, చిక్కుడుకాయలు రూ.80, బరాబటీ రూ.70, బీరకాయలు రూ.60, క్యాబేజీ పువ్వు ఒకటి రూ.50, కాప్సికమ్ రూ.80, క్యారెట్ రూ.40, టమాటా రూ.50, ఉల్లి



రూ.30, అల్లం రూ.60, మునక్కాడలు రూ.10కి రెండు ఇలా ఏది ముట్టుకున్నా షాక్ కొట్టే విధంగా కొనలేని విధంగా ఉన్నాయి. దీంతో కేజీ కొనేవారు పావుకేజీతో సరిపెట్టుకుంటున్నారు. పోనీ ఆకుకూరలు వండుకుందామంటే, వాటిది అదే దారి.. కొత్తిమీర కట్ట చిన్నది 10 రూపాయలు, తోటకూర రూ.10కి రెండు కట్టలు, పాలకూర రూ.10కి నాలుగు కట్టలు, బచ్చలికూర రూ.10కి నాలుగు, గోంగూర రూ.10కి ఐదు కట్టలు అమ్ముతున్నారు.

ఎక్కువ రకాలు ఇతర ప్రాంతాల నుంచే..

అనకాపల్లి మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి ఉల్లి ఎక్కువగా వస్తుంటాయి. ఒడిశా, కోల్‌కత్తా నుంచి బంగాళదుంపలు, పచ్చిమిర్చి, ఇతర రాష్ట్రాల నుంచి దొండకాయలు, క్యారెట్, బీట్‌రూట్, కాప్సికం, క్యాబేజీ, దొండకాయలు, దోసకాయలు, ఆకాకరకాయలు ఇలా ఎక్కువ కాయగూరల రకాలన్నీ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నవే.

స్థానికంగా ప్రోత్సాహం కరువు..

అనకాపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని రకాల కాయగూరలు పండిస్తుంటారు. ఈ ఏడాది విత్తనాలు వేసిన ప్రారంభంలో వర్షాలు కురవలేదు. అవసరం లేనప్పుడు ఎండాకాలంలో వర్షాలు అధికంగా పడ్డాయి. అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాలలో ఎక్కువగా పరిశ్రమలు రావడంతో పంటలు పండించే రైతులు కరువయ్యారు. ఏదిఏమైనా ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుల పంట దళారుల పాలు



పట్టణంలో రైతు బజార్ లేదు. దీంతో రైతులు పండించే పంటలు దళారుల పాలవుతోంది. రైతుల వద్ద తక్కువకు కొని వ్యాపారులు ఎక్కువ ధరకు ప్రజలకు అమ్ముతున్నారు. అదే రైతుబజార్ ఉంటే ప్రభుత్వమే గిట్టుబాటు ధర నిర్ణయిస్తుంది. దీంతో అటు వినియోగదారుడు, ఇటు రైతు లాభపడతాడు.

– నాగేశ్వరరావు రైతు, సిహెచ్.ఎన్. అగ్రహారం

ధరల నియంత్రణ చేయాలి



ఒక్కసారిగా కాయగూరలు ధరలు రెట్టింపు అయ్యాయి. కేజీ కొందామని వెళితే పావు కేజీతో సరిపెట్టుకుంటున్నాం. ప్రభుత్వం ధరల నియంత్రణ చేయాలి.

– ఏడువాకల నారాయణరావు, అనకాపల్లి

కాయగూరల సాగు పెంపునకు చర్యలు

మండలంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. వంగ, టమాటా, చిక్కుడు, ఆనప, బీర, కాకర, ఆకుకూరలు పంటలు వేస్తున్నారు. పండించిన పంట ఉత్పత్తులు రైతులు కొంతమేర విశాఖపట్నం తీసుకెళ్తున్నారు. అందువల్ల స్థానికంగా కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. కాయగూరల సాగును పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను గ్రామసభల ద్వారా వివరిస్తున్నాం.

–ఎం.ఎ. రహీమ్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, అనకాపల్లి

ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని ఎన్నికల హామీ ఇచ్చి ఏడాదిగా మోసం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు విమర్శించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేసి, కార్యాలయ ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. దొరబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర ఎందుకు అమలు చేయలేదో కూటమి ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు వేధింపులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ మంజూరు చేసే అనుమతులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం వల్ల అధిక నగదు చెల్లించే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో మాదిరిగానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. ప్రమాదాల నియంత్రణ పేరుతో తీసుకువచ్చిన 2023 నూతన మోటార్



ఏవో శ్రీనివాసరావుకు వినతిప్రతం అందజేస్తున్న రాజాన దొరబాబు

యాక్ట్ చట్టాన్ని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న వారికి ఉద్యోగాలు లేక ఆటోలు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నారని వాపోయారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వి. రాజు, సన్నిబాబు, దొండ అప్పారావు, జి. అప్పారావు, జె.మహేష్, గిరి, పోతురాజు, ఆటో డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు

అనకాపల్లి టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు అమ్మకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కార్యాలయంలో జెడ్సీ చక్రవర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. పర్యావరణానికి హాని చేసే విగ్రహాలు పట్టణ శివారుల్లో తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా

కశింకోట: పాడి రైతులకు రాయితీపై పశువుల సమీకృత మిశ్రమ దాణా అందిస్తున్నామని కన్నూరుపాలెం పశు వైద్య కేంద్రం వైద్యాధికారి డయానా తెలిపారు. మండలంలోని కన్నూరుపాలెంలో పాడి రైతులకు రాయితీపై దాణా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తా రూ.1110 కాగా, రూ.555కు దాణా అందిస్తున్నామన్నారు. ఇది వేసవిలో ఎండు గడ్డి కొరత ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా నేడు

అనకాపల్లి టౌన్: స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వెంటనే ఆపాలని పట్టణంలోని నెహ్రూచౌక్ జంక్షన్‌లో మంగళవారం తలపెట్టిన ప్రజా వేదిక ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలపై మరో రూ.12,771 కోట్ల విద్యుత్ భారాన్ని మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ధర్నాలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

ప్రజల్లో వైషమ్యాలు సృష్టిస్తున్న పాలకవర్గాలు

అనకాపల్లి: దేశంలో పాలకవర్గాలు ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్నాయని న్యాయవాది ఐఆర్ గంగాధర్ తెలిపారు. మండలంలో వేట జంగాలపాలెంలో దివంగత యగ్గాడ నాగేశ్వరరావు 24వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి గంగాధర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నాగేశ్వరరావు అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజా సంఘాలు బలపడాలన్నారు. దేశంలో మానవ హక్కులు రోజురోజుకీ హరించబడుతున్నాయని, పీడిత కులాలు మరింత దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నాయని వాపోయారు. గిరిజన సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకుడు పి.ఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన



నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గంగాధర్, అజయ్‌కుమార్

నిలబడి పోరాడిన యోధుడు యగ్గాడ నాగేశ్వరరావు అని, ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది చిట్ట జయశ్రీ, మాజీ సర్పంచ్ పూడి చిన్నారావు, దళిత బహుజన ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు కొల్లి చిన్న అప్పారావు, నాయకులు ఇల్లపు నూకేశ్వరరావు, మరిపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ హిమగిరి సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో 2001-02 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కోన లక్ష్మణ, వైస్ చైర్మన్ ఎండి బాషా మాట్లాడుతూ 25 సంవత్సరాలు తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో, ఇతర దేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు అందరూ కలుసుకుని వచ్చే ఏడాది కొండ వద్ద కుటుంబ సమేతంగా పిక్నిక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. చదువుకున్న హైస్కూల్‌కు తమ వంతు సహా



యాన్ని త్వరలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పలక మణిబాబు, మంజునాథ్, ఎస్.శివశంకర్, కోట శంకర్, ఉప్పల సంతోష్, కింతాడ సత్యనారాయణ, కలిశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లతో అంగన్‌వాడీల నిరసన

అనకాపల్లి టౌన్: అంగన్‌వాడీల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో ట్యాబ్‌లను సరఫరా చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్ చేశారు. స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ సెల్‌ఫోన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన యోజన వివరాలు అప్‌లోడ్ చేయాలని బాధ్యత అప్పజెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 250 మంది కార్యకర్తలు తమ సెల్‌ఫోన్లను సీడీపీవోకు అందజేశారు. అనంతరం నాగశేషు మాట్లాడుతూ సెల్‌ఫోన్లు 2జీ, 4జీ నెట్‌వర్క్ కలిగి ఉన్నాయన్నారు. దీనివల్ల ఆన్‌లైన్ వర్కుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తీవ్ర



సీడీపీవో కార్యాలయం ఎదుట సెల్‌ఫోన్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. అంగన్‌వాడీల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మారుస్తామని మంత్రి వర్గంలో తీర్మానం చేసి నేటికీ జీవో అమలు కావడం లేదన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలకు వినతి



ప్లాట్‌లు వేసి విక్రయాలు జరుపుతున్న స్థలం

సబ్బవరం: మండలంలోని ఎరుకునాయుడుపాలెంలో జగనన్న లే అవుట్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ప్లాట్లుగా విభజించి విక్రయాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని అసకపల్లి మాజీ ఉప సర్పంచ్ మొల్లి చిన్నారావు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వంలో ఎరుకునాయుడుపాలెం రెవన్యూ పరిధి సర్వే నెం.73, 75లలో పేదలందరికీ ఇళ్లు, ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు వీఎంఆర్డీఏ ద్వారా లే అవుట్‌లు వేసి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందన్నారు. వీఎంఆర్డీఏ నిబంధనల మేరకు సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంపై అక్రమార్కులు కన్నేశారని పేర్కొన్నారు. ఈ భూమికి సర్వే జరిపి, అక్రమార్కుల ప్లాట్లను తొలగించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

కొందరికే సంక్షేమ పథకాల లబ్ధి

- మిగిలిన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంలో అరుంధతీనగర్ వాసుల ఆవేదన

అనకాపల్లి: సంక్షేమ రథసారధి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సింగల్ ఓడించడం కష్టమని తెలుసుకుని మోసగాడు సీఎం చంద్రబాబు, వేషగాడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూటమిగా ఏర్పడి దగాకోరు హామీలతో గద్దెనెక్కారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు అమలు చేయకపోవడంతో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీతో ప్రజలు పక్షాన పోరాడుతూ ఇంటింటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం రాత్రి స్థానిక 80వ వార్డు గవరపాలెం, అరుంధతీనగర్‌లో వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ దండా సిద్ధార్థ, దండా జ్ఞానదీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ నగదు కొంతమందికి మాత్రమే పడిందని, మిగిలిన వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ల చెప్పులరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయిందని పలువురు వాపోయారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేసేవారన్నారు. భరత్‌కుమార్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన వెంటనే 2024 జూన్ నుంచి సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి ఏడాదిగా పట్టించుకోలేదన్నారు. ప్రజలను మోసం చేసే నాయకుడిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నవరత్నాలను ప్రవేశపెట్టి అర్హులైన లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఏడాది నుంచి విద్యుత్ చార్జీలు పెరిగిపోయాయని, కొత్తగా స్మార్టు మీటర్లు గృహాలకు బిగించినట్లయితే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పుతారని జోష్యం చెప్పారు. అనంతరం భరత్‌కుమార్‌ను కె.ఎం.నాయుడు, వార్డు నాయకులు గజమాలతో సత్కరించి, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నాయకులు చరణ్‌తేజ్, పెట్ల నాగేశ్వరరావు, లోకేష్, సాయి, నవీన్, పెంటకోట శ్రీను, గొల్లవిల్లి నర్సింగరావు, కాండ్రేగుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోట్నివీధిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

అనకాపల్లి: పట్టణంలోని 84వ వార్డు కోట్నివీధిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలన్నారు.



అరుంధతీనగర్‌లో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న మలసాల భరత్‌కుమార్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత బాల ఆదిత్యరెడ్డికి బాండ్ అందిస్తున్న ఈవో త్రినాథరావు



చెక్కు అందిస్తున్న దాత సూర్యప్రకాశరావు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి తగరపువలసకు చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి రూ.లక్ష విరాళాన్ని పీఆర్వో కార్యాలయంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు ఈవో వి.త్రినాథరావు బాండ్ అందించారు. నగరంలోని మహారాణిపేటకు చెందిన కె.సూర్యప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కురూపంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు.

జాతీయ 'బాక్సింగ్' పోటీలకు ఎంపిక

పరవాడ: విశాఖపట్నంలో గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆర్.యువరాజ్, కె.కోవిద, కె.హర్షితలు జాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఈ నెల 6 నుంచి 13 వరకు ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులతో పాటు కోచ్‌లు అమర్‌నాథ్, అన్నపూర్ణలను పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, సీఈవో కె.నిశాంత్‌లు సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని అభిలషించారు.



జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని 10 మద్యం సీసాలను తరలిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ టి. విజయ్‌కుమార్ తెలిపారు. చేపల బజార్ రోడ్డులో కె. కాసులమ్మ అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తుండగా, ఆమెను అదుపులోకి తీసుకున్నామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు.